సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



ఆక్వా ఆక్రమణలో బోదెలు

ఉండి నియోజకవర్గంలో పంట బోదెలు, మురుగు బోదెలను ఆక్వా చెరువులు మింగేస్తున్నాయి. అక్రమార్కులు వాటిని చెరువుల్లో కలిపేసుకుంటున్నారు. IIలో ▸



పట్టిసంలో ముగిసిన ఉత్సవాలు

పట్టిసం శివక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. సుమారు 1.50 లక్షల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. IIలో ▸



మెకానికల్ వర్క్‌షాప్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో ఆటోడెస్క్ ఇన్వెంటరీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. IIలో ▸

దాడులు.. బెదిరింపులు

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పోలింగ్‌లో అక్రమాలు

- ఉమ్మడి పశ్చిమలో టీడీపీ నేతల బరితెగింపు
- పోలింగ్ కేంద్రాల వద్ద తారాస్థాయిలో హల్‌చల్
- పెదవేగిలో పీడీఎఫ్ ఏజెంట్‌పై దౌర్జన్యం
- లింగపాలెం మండలంలో పోలింగ్ కేంద్రం నుంచి పీడీఎఫ్ ఏజెంట్ గెంటివేత
- ఏలూరు కోటదిబ్బలో డబ్బుల పంపిణీని అడ్డుకున్న పీడీఎఫ్
- భారీగా దొంగ ఓట్ల నమోదు
- పూర్తిగా వదిలేసిన పోలీస్ యంత్రాంగం
- ఏలూరు జిల్లాలో 70.13 శాతం, పశ్చిమలో 69.80 శాతం పోలింగ్ నమోదు



లింగపాలెం మండలం శింగగూడెంలో పోలింగ్ బూత్ 277, 278 వద్ద టీడీపీ నేతల హల్‌చల్



మండవల్లిలో నగదు పంచుతున్న టీడీపీ నేతలు



ఏలూరులో పోలింగ్ కేంద్రం గేట్ వద్ద హడావుడి చేస్తున్న టీడీపీ నేతలు



నగదు పంపిణీ చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: టీడీపీ నేతలు బరితెగించారు.. అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా వ్యవహరించారు. ఓటు వేసే సమయంలోనూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వ్యవహరించడంతో పాటు పీడీఎఫ్ ఏజెంట్లపై దాడులు, దౌర్జన్యాలు, కొన్ని చోట్ల పోలింగ్ బూత్ నుంచి గెంటివేసి ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు 45 శాతం ఉన్న పోలింగ్ చివరి రెండు గంటల్లో సుమారు 25 శాతం పెరిగింది. ఉమ్మడి పశ్చిమలో పూర్తిగా ఏకపక్షంలో ఎన్నికలు నిర్వహించారని పీడీఎఫ్ ఆరోపణలు గుప్పించినా అధికారులు చాలా తేలికగా తీసుకున్నారు. మరోవైపు చివరి గంట సమయంలో దొంగ ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి. మొత్తంగా ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో 2,18,902 ఓట్లు పోలై 69.50 శాతంగా పోలింగ్ నమోదైంది. ఏలూరు జిల్లాలో 70.13 శాతం, పశ్చిమలో 69.80 శాతం నమోదైంది.

పోలింగ్ బూత్‌ల వద్ద స్వైరవిహారం

పచ్చమూకలు రెచ్చిపోయాయి. సాధారణ ఎన్నికల తరహాలో వ్యవహరించి ప్రధాన పోటీదారుగా ఉన్న పీడీఎఫ్ ఏజెంట్లు, నాయకులపై అడుగడుగునా జులుం ప్రదర్శించారు. ఎర్ర చొక్కా వేసుకు వచ్చారని పీడీఎఫ్ నాయకులను కొన్నిచోట్ల పోలీసులు అరెస్టు చేసి, పసుపు చొక్కా వేసుకువచ్చిన టీడీపీ నేతలు పోలీసుల ఎదురే పోలింగ్ బూత్‌ల వద్ద స్వైరవిహారం చేసినా పట్టించుకోని పరిస్థితి. ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. ఏలూరు జిల్లాలో కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలు మినహా మిగిలిన ఐదు నియోజకవర్గాల్లో 66 పోలింగ్‌బూత్‌ల్లో 42,242 మందికిగాను 29,651 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 70,052 మంది ఓటర్లకుగాను 48,893 మంది ఓటుహక్కు వినియోగించుకోవడంతో 69.80 శాతంగా పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. చివరి రెండు గంటలు మాత్రం అధికార పార్టీ హడావుడితో పోలింగ్ శాతం సుమారు 25 శాతం మేర పెరిగింది. కేవలం అధికార పార్టీ దౌర్జన్యకాండతోనే పోలింగ్ శాతం పెరిగింది.

ఏలూరు జిల్లాలో పోలింగ్ సరళి

- ఉదయం 10 గంటలకు 3,403 ఓట్లు పోలై 8.05 శాతం.
- మధ్యాహ్నం 12 గంటలకు 10,836 ఓట్లు పోలై 25.63 శాతం.
- మధ్యాహ్నం 2 గంటలకు 19,898 ఓట్లు పోలై 47.06 శాతం.
- సాయంత్రం 4 గంటలకు 29,651 ఓట్లు పోలై 70.13 శాతం నమోదైంది.

పశ్చిమగోదావరి జిల్లాలో పోలింగ్ సరళి

- ఉదయం 10 గంటలకు 6,978 ఓట్లు పోలై 9.96 శాతం.
- మధ్యాహ్నం 12 గంటలకు 19,133 ఓట్లు పోలై 27.31 శాతం.
- మధ్యాహ్నం 2 గంటలకు 31,562 ఓట్లు పోలై 45.06 శాతం.
- సాయంత్రం 4 గంటలకు 48,693 ఓట్లు పోలై 69.80 శాతం నమోదైంది.

దౌర్జన్యాలు.. దొంగ ఓట్లు.. ఓటుకు నోట్లు

- తెలుగుదేశం పార్టీ పూర్తిగా బరితెగించి పీడీఎఫ్ ఏజెంట్లే లక్ష్యంగా దాడులకు, ఘర్షణలకు తెగబడింది.
- దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగిలో పీడీఎఫ్ ఏజెంటుగా సీఐటీయూ నాయకుడు గేదెల శివకుమార్‌పై టీడీపీ శ్రేణులు దౌర్జన్యం చేసి దాడి చేశారు.
- జంగారెడ్డిగూడెంలోనూ ఘర్షణ జరిగినట్టు సమాచారం.
- లింగపాలెం మండలంలోని శింగగూడెం పోలింగ్ బూత్ 277, 278లో టీడీపీ నేతలు అత్యుత్సాహంగా వ్యవహరించారు. నేరుగా స్కూల్ ప్రాంగణంలోని పోలింగ్‌బూత్ పక్కనే గుంపులుగా ఉండి ఓటర్లను ప్రలోభపెట్టడంతో పాటు బూత్‌లో ఏజెంటుగా ఉన్న డీవైఎఫ్ఐ నాయకుడు సూర్యకిరణ్‌ను బెదిరించి మొబైల్ లాక్కుని బయటకు గెంటేశారు. ఈ పోలింగ్ బూత్‌లో అత్యధికంగా 78 శాతం పోలింగ్ నమోదైంది. ఇక్కడ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల సమయంలో ఆధార్ కార్డుల ఆధారంగా దొంగ ఓట్లు పోలైనట్టు పీడీఎఫ్ నేతలు ఆరోపిస్తున్నారు.
- యడవల్లి గ్రామానికి చెందిన సి.చిన్నారావు కుటుంబంతో సహా ఓటు వేయడానికి 278 పోలింగ్ బూత్‌కు వస్తే అప్పటికే అతని ఓటు పోలైంది. పోలింగ్ సిబ్బందిని తన ఓటు గురించి ప్రశ్నించి స్పందన లేకపోవడంతో వెనుదిరిగారు.
- దెందులూరు హైస్కూల్‌లో 347, 348 పోలింగ్ బూత్‌ల్లో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహేష్ చీఫ్ ఏజెంటుగా వ్యవహరించి నాన్‌లోకల్ ఓట్లు వేయించారని పీడీఎఫ్ ఆరోపించింది.
- అలాగే కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి కైకలూరు నియోజకవర్గం మండవల్లిలో బహిరంగంగానే ఓటుకు నోటు పంపిణీ చేశారు.
- ఏలూరు నగరంలో కోటదిబ్బలోని కల్యాణ మండపంలో టీడీపీ కార్యకర్తలు డబ్బులు పంచుతుండటంతో పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చేరుకునే లోపు కల్యాణ మండపానికి తాళాలు వేసి వెళ్లిపోయారు.
- పలు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ నేతలు ఇదే రీతిలో హల్‌చల్ చేశారు.

న్యూస్‌రీల్

21 రోజులు.. రూ.2.22 కోట్లు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 21 రోజులకు నగదు రూపేణా రూ.2,22,23,339 ఆదాయం లభించినట్టు ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన 215 గ్రాముల బంగారం, 4.085 కేజీల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2,000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.25,500 లభించిందన్నారు.

జేఈఈ టాపర్‌గా యశ్వంత్‌సాయి



నిడమర్రు: జేఈఈ మెయిన్స్–2 ఫలితాల్లో కొల్లేరు ప్రాంతంలోని చానమిల్లి గ్రామానికి చెందిన బేతు యశ్వంత్ సాయి 99.95 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా 13వ ర్యాంకు, ఈడబ్ల్యూఎస్ విభాగంలో 1వ ర్యాంకు సాధించినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. విజయవాడలో ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్నట్టు తల్లిదండ్రులు సూరిబాబు, నాగలక్ష్మి తెలిపారు. సూరిబాబు తాపీ మేస్త్రిగా జీవనం సాగిస్తున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన యశ్వంత్ సాయి జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించడంపై చానమిల్లి గ్రామ పెద్దలు అభినందించారు.

సివిల్ సప్లయిస్ డీఎంగా ప్రభాకర్‌రావు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంగా పి.ప్రభాకర్‌రావు నియమిస్తూ రెండు రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. క్యాప్ అండ్ సీఎస్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంగా నియమించారు. ప్రస్తుతం జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంగా టి.శివరామ ప్రసాద్ పనిచేస్తున్నారు.

వెబ్‌సైట్‌లో 'ఓపెన్' హాల్‌టికెట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఆధ్వర్యంలో దూర విద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షల హాల్‌టికెట్లు ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని లేదా అధీకృత స్టడీ సెంటర్ల కో–ఆర్డినేటర్ల నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. పరీక్షలు మార్చి 3న ప్రారంభమై 15 వరకు కొనసాగుతాయని తెలిపారు.

ఎన్నికల నిబంధనలకు పాతర



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కైకలూరు నియోజకవర్గంలో కూటమి శిబిరాల పేరుతో జాతర నిర్వహించి ఎన్నికల నియమాలకు పాతర వేసిందని, డబ్బులు పంపిణీ, అక్రమాలకు పాల్పడ్డారని కార్మిక, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. గురువారం ఏలూరులో నిర్వహించిన ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. కూటమి నాయకులు కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేశారన్నారు. పోలీసులు పట్టించుకోకుండా అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించారని విమర్శించారు. ఎన్నికల సంఘం స్పందించాలని కోరారు. అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు ఓట్లు వేసిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

శోభాయమానం.. సోమేశ్వరుడి రథోత్సవం



భీమవరంలో ఉమాసోమేశ్వర స్వామి రథోత్సవం

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామక్షేత్రం భీమవరం గునుపూడిలో ఉమాసోమేశ్వరస్వామి రథోత్సవం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ముందుగా రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి విశేష పూజలు చేశారు. రథోత్సవాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. గునుపూడి దేవస్థానం వద్ద నుంచి నాచువారి సెంటర్ వరకు భక్త జనసందోహం మధ్య బాణసంచా కాల్పులతో రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ డి.కృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షీరారామం.. పోటెత్తిన భక్తజనం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో భక్తులు పోటెత్తారు. మల్లన్న పాగాను తయారు చేసిన వరదా సోమేశ్వరరావు 11.45 గంటల సమయంలో ఆలయంలో ప్రదక్షిణలు చేసి అర్చకులకు పాగాను అందజేశారు. పాగాకు పూజలు చేసిన తర్వాత ఆలయ శిఖరం నుంచి గాలి గోపుర శిఖరం వరకూ



పాలకొల్లులో మల్లన్న పాగాను తీసుకువెళుతున్న దృశ్యం

అలంకరించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో లక్షపత్రి పూజ చేశారు. భక్తులు ఏకాదశ మహా రుద్రాభిషేకాలు చేయించుకున్నారు. గురువారం సాయంత్రం రావణ బ్రహ్మ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. రథం ముందు గాదె జనార్దనగుప్తా కుటుంబ సభ్యులు కుంభం పోసి నైవేద్యం సమర్పించారు. ఏసీ ఈవీ సుబ్బారావు, ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ వాసు, అర్చకులు కిష్టప్ప, వీరబాబు, అనిల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటెత్తని పట్టభద్రులు

- మందకొడిగా పోలింగ్
- జిల్లాలో 69.80 శాతం ఓటింగ్
- నిబంధనలు మీరి కూటమి ప్రచారం
- ఓటర్లకు ప్రలోభాల ఎర
- పోలింగ్ సరళిపై ఆందోళనలో కూటమి
- గెలుపు ధీమాలో పీడీఎఫ్ వర్గాలు



భీమవరంలో ఓటేస్తున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు



భీమవరంలో ఓటేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

సాక్షి, భీమవరం: కూటమి ప్రభుత్వం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం చేసినా పట్టభద్రులు అంతగా ఆసక్తి చూపించలేదు. జిల్లాలో 69.80 శాతం మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్‌లో ఎక్కువగా ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసంఘాల వారే ఉండటం కూటమిని కలవరపరుస్తుండగా, పీడీఎఫ్ తమ అభ్యర్థి గెలుపుపై ధీమాతో ఉంది. మార్చి 3న ఎన్నికల ఫలితం తేలనుంది.

70 వేలకుపైగా ఓటర్లు.. 93 కేంద్రాలు

జిల్లాలో 70,052 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వీరిలో 39,863 మంది పురుషులు, 30,187 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. 20 మండలాల్లో 93 పోలింగ్ కేంద్రాలకు భీమవరం డివిజన్‌లో 29, నరసాపురం డివిజన్‌లో 33, తాడేపల్లిగూడెం డివిజన్‌లో 31 కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 585 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు.

మందకొడిగా పోలింగ్

జిల్లావ్యాప్తంగా ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా సాగింది. ఉదయం 10 గంటల సమయానికి 10.61 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 27.28 శాతం, 2 గంటలకు 45.06 శాతం, సాయంత్రం 4 గంటలకు 69.80 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా 48,893 మంది ఓటు వేయగా వీరిలో



వీరవాసరంలోని పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పురుషులు 27,960 మంది, మహిళలు 20,933 మంది ఉన్నారు

పీడీఎఫ్‌కు లాభించే అంశం

పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులు ప్రచారం చాపకింద నీరులా సాగిపోయింది. యూటీఎఫ్, ఉద్యోగ, ప్రజాసంఘాలు ఆయనకు మద్దతుగా పనిచేశాయి. 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా పీడీఎఫ్, కూటమి అభ్యర్థుల మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. పోలింగ్‌లో అధికశాతం ఉపాధ్యాయ, ఉద్యోగ, ప్రజాసంఘాల వర్గాలే పాల్గొనడం తమకు లాభించే అంశంగా పీడీఎఫ్ శ్రేణులు చెబుతున్నాయి.

కూటమికి కలిసిరాని క్యాంపెయినింగ్

ఎన్నికల ప్రచారంపై సీఎం చంద్రబాబు ప్రతిరోజూ సమీక్షించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం కూటమి అభ్యర్థి పి.రాజశేఖర్‌ను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కూటమి ఎమ్మెల్యేలు, నేతలు ప్రచారం చేశారు. పలుచోట్ల ప్రలోభాలకు సైతం తెరలేపారు. పాలకొల్లు నియోజకవర్గంలో దూరప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు రూ.2,500 చొప్పున కూటమి నాయకులు అందజేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో భారీగా పోలింగ్ నమోదవుతుందని కూటమి శ్రేణులు భావించాయి. అయితే సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించడం, జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ, నెలకు రూ.3 వేల నిరుద్యోగభృతిని గాలికొదిలేయడంతో కూటమి ప్రభుత్వ తీరుపై నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత మెగా డీఎస్సీ ఉంటుందని ఆ పార్టీ నేతలు చేసిన ప్రచారాన్ని వారు విశ్వసించలేదు. దీంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆకస్మికంగా తనిఖీ చేసి పోలింగ్ నిర్వహణ, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పట్టభద్రులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి కేంద్రం వద్ద పక్కాగా బందోబస్తుతో పాటు రూట్ మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్నికలకు ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. భీమవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు ఆయన వెంట ఉన్నారు.



సూచనలిస్తున్న ఎస్పీ నయీం అస్మి

ప్రశాంతంగా పోలింగ్ : కలెక్టర్

వీరవాసరం: జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ నాగరాణి తెలిపారు. గురువారం భీమవరంలోని పీఎస్ఎం బాలికల హైస్కూల్, వీరవాసరంలోని ఎంఆర్‌కే జెడ్పీహైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఓటర్లతో మాట్లాడి ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని మూడు డివిజన్‌లలో ఆర్డీఓలు నోడల్ అధికారులుగా ఉన్నారన్నారు. జిల్లాలోని 93 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు భీమవరం కలెక్టరేట్‌కు చేరుకుంటాయని, అక్కడి నుంచి ఏలూరులోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. మార్చి 3న ఏలూరులో కౌంటింగ్ ఉంటుందన్నారు. అనంతరం భీమవరం కలెక్టరేట్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని ఆమె పరిశీలించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

నిబంధనలు మీరి కూటమి శిబిరాలు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లలోపు కూటమి నేతలు శిబిరాలను ఏర్పాటుచేయడం విమర్శలకు తావిచ్చింది. స్థానిక ఎంఎంకేఎస్ఎం ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఉండగా ముందుగా కూటమి ఏతలు కల్పనా వారి వీధిలో శిబిరాలను ఏర్పాటుచేశారు. అయితే మంత్రి నిమ్మల రామానాయుడు ఓటేసేందుకు వచ్చి ఇంత దూరంలో శిబిరం ఉంటే ఓటర్లకు ఎలా కనిపిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో.. 100 మీటర్ల లైన్ దాటి పోలింగ్ కేంద్రానికి అతి సమీపంలో టెంట్ వేసి శిబిరం ఏర్పాటుచేశారు. దీనిపై ఫిర్యాదులు అందగా తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ ఇక్కడకు చేరుకుని శిబిరాన్ని తొలగించారు. నిబంధనలు మీరితే సహించమని హెచ్చరించారు. అభ్యర్థి నంబర్ సూచించే ప్లకార్డులు కూడా వంద మీటర్లలోపు ఉండకూడదని తొలగించారు.



పాలకొల్లులో కూటమి శిబిరాన్ని తొలగించాలని హెచ్చరిస్తున్న తహసీల్దార్ దుర్గాకిషోర్

నాన్ లోకల్ ఓటర్‌కి రూ.2,500?

ఓటేసేందుకు బెంగళూరు, హైదరాబాద్, విశాఖ వంటి దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లకు నగదు ప్రోత్సాహకాలు అందించినట్టు సమాచారం. దీంతో కొందరు శిబిరాల వద్ద క్యూ కట్టారు. జాబితాలో కొందరి పేర్లు లేవని, మిమ్మల్ని లోకల్ ఓటరుగానే గుర్తిస్తామనడంతో తీవ్ర చర్చ జరిగింది. దూరప్రాంతాల నుంచి వచ్చే ఓటర్లకు మాత్రమే దారి ఖర్చుల నిమిత్తం రూ.2,500 ఇవ్వాలని నిర్ణయించిన కూటమి నేతలు పేర్ల నమోదులో అలసత్వం ప్రదర్శించినట్లు తెలిసింది. ఉదాహరణకు తమ వార్డు పరిధిలో 15 మంది ఓటర్లు దూర ప్రాంతంలో ఉన్నారని గుర్తించగా వారిలో పది మంది పేర్లు మాత్రమే పార్టీ కార్యాలయంలో నమోదు చేసుకున్నారు. దీంతో కొద్దిసేపు శిబిరాల చుట్టూ ఓటర్లు తిరిగారు. కొందరు ఓటర్లకు మెయిన్‌రోడ్‌లోని మసీదు వద్ద ఉన్న ఓ వ్యాపార సంస్థ వద్ద నగదు అందించడం గమనార్హం.

క్లుప్తంగా

బువ్వనపల్లిలో సినిమా షూటింగ్



ఈపూరి నివాసంలో జరుగుతున్న సినిమా షూటింగ్

నిడమర్రు: బువ్వనపల్లి గ్రామంలోని లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ నివాసం దొర గారి మేడలో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. నవీన్ పోలిశెట్టి హీరోగా, పరియా అబ్దుల్లా, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా తెరకెక్కుతున్న 'అనగనగా ఒక రాజు' అనే చిత్రం షూటింగ్ జరిగింది. హీరో పెళ్లి చూపులకు సంబంధించిన సన్నివేశాలను దొరగారి మేడలో చిత్రీకరించారు. ఈ షూటింగ్‌లో నటులు నవీన్, పరియా అబ్దుల్లాతోపాటు కాదంబరి కిరణ్, మహేష్, చమ్మక్ చంద్ర తదితరులు పాల్గొన్నారు. స్రింట్ స్క్రీన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంకు తమిళ దర్శకుడు కె.మరియప్ప దర్శకత్వం వహిస్తుండగా ఎస్. నాగవంశి నిర్మాత అని చిత్ర బృందం సభ్యులు తెలిపారు.

కార్ డెకార్స్ దుకాణాలపై కేసులు



షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వీ శ్రీరాంబాబు ఆదేశాల మేరకు గురువారం ఏలూరులోని పలు కార్ల డెకరేషన్ సామాగ్రి విక్రయించే దుకాణాల్లో విజిలెన్సు, తూనికలు కొలతల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో తయారీ తేదీ, తయారీదారుని చిరునామా, గరిష్ట చిల్లర ధర, వినియోగదారు సేవ ఫోన్ నెంబర్ వంటి సమాచారం లేకుండా ఉన్న వివిధ రకాల స్పీకర్లు, టచ్ స్క్రీన్లు, హెడ్ లైట్లు ఇతర కార్ల అలంకరణ ఉపకరణాలను గుర్తించారు. ఆయా సామాగ్రిని గుర్తించిన ఏటు జడ్ కార్ డెకార్స్, లాస్య కార్ డెకార్స్, బన్ను కార్ డెకార్స్ షాపుల యజమానులపై తూనికలు కొలతలు చట్ట ప్రకారం మొత్తం 6 కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పీ శివరామ కృష్ణ, విజిలెన్స్ ఎస్సై కే సీతారాము, ఏలూరు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వీ ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్వా ఆక్రమణలో బోదెలు

చోద్యం చూస్తున్న మత్స్యశాఖ అధికారులు



ఉండి అర్తమూరు రోడ్డులో పంట బోదె ఆక్రమణ



బోదె ఆక్రమించి కాలువగట్టుపై వేసిన చెరువు గట్టు



ఉప్పరగుంట, అర్తమూరు రోడ్డులో అక్రమంగా తవ్విన బోర్లు

ఉండి: నియోజకవర్గంలోని ఉండి, కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు మండలాల్లో పంట బోదెలు, మురుగు బోదెలను ఆక్వా చెరువులు మింగేస్తున్నాయి. నీటి పారుదలకు ఏర్పాటు చేసిన పంట బోదెలు, మురుగు బోదెలు ఆక్వా, వరి సాగులో ఎంతో అవసరం. కొందరు స్వార్థపరులైన రైతులు వాటిని ఆక్వా చెరువుల్లో కలిపేసుకుని గట్లు వేసుకుంటున్నారు. అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేయకుండానే నూతన ఆక్వా చెరువుల తవ్వకాలు, రిపేర్లకు అనుమతులు ఇస్తున్నారు. దీంతో ఇష్టానుసారం తవ్వకాలు చేస్తూ బోదెలు ఆక్రమిస్తున్నారు. ఈ ఆక్రమణ వల్ల ప్రతి రైతుకు 10 నుంచి 15 సెంట్ల అదనపు భూమి కలిసి రావడంతో ఒకరిని చూసి మరొకరు ఆక్రమణల పర్వానికి తెరదీస్తున్నారు. నియోజకవర్గ మత్స్య శాఖ అధికారి, ఆయా మండలాల ఇరిగేషన్, డ్రెయినేజీ ఏఈలు, డీఈ ఒక్కసారి కూడా పరిశీలన చేయకపోవడం గమనార్హం. పంట, మురుగు బోదెల ఆక్రమణతో వర్షాకాలంలో ఆయా ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. రైతులు తమ పొలం వరకే చెరువులు తవ్వకం చేస్తే సరిపోతుంది. నిబంధనలను అతిక్రమించి బోదెలను ఆక్రమించి కాలువలు కనుమరుగు చేస్తున్నారు.

ఏటా తప్పని ముంపు

వర్షాకాల సమయంలో ఉండి నియోజకవర్గంలో కొద్దిపాటి వర్షానికి వరి పంట నీట మునగడంతో పాటు ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. దీంతో వరిసాగులో నష్టాలు తప్పడం లేదు. వర్షాకాలంలో పంట, మురుగు బోదెల ద్వారా ముంపు నీరు పారుతుంది. వాటిని ఆక్వా చెరువులతో పాటుగా ల్యాండ్ కన్వర్షన్ చేసిన వారు తమ పరిధిలో పంట బోదెలను ఆక్రమించుకుని భవనాల నిర్మాణం, లే అవుట్లు వేయడంతో ముంపు ప్రమాదం మరింతగా పెరుగుతుంది.

పొలాలు పూడ్చి బోదెలు ఆక్రమించుకుని

నియోజకవర్గ కేంద్రం ఉండిలోని గణపవరం రోడ్డులో వరి పొలాలను కొన్నేళ్ల క్రితం పూడ్చి లే అవుట్లు వేశారు. పంటబోదెలను పూర్తి స్థాయిలో అక్రమించుకుని ఇళ్ల నిర్మాణం, రొయ్యల షెడ్లు, దుకాణాలు, గోడౌన్‌లు, స్కూళ్ల నిర్మాణం చేయడంతో గణపవరం రోడ్డు ధ్వంసమవుతోంది. ఉండి సెంటర్ నుంచి ఏఎంసీ వరకు పెద్ద పంట బోదెను పూర్తిగా అక్రమించుకున్నారు. పదెకరాల తూము ప్రాంతంలో పంట బోదెను ఆక్రమించుకుని ఫ్యాక్టరీలు నిర్మించారు. అన్ని మండలాల పరిధిలో ఎవరు పంటబోదెలు, మురుగు బోదెలు ఆక్రమించుకున్నా అధికారులు చోద్యం చూస్తుండటంతో భవిష్యత్‌లో ముంపు ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది.

విచ్చల విడిగా బోర్లు : నియోజకవర్గంలో సుమారుగా నూటికి 90 శాతం ప్రతి ఆక్వా చెరువు వద్ద ఉప్పు నీటి కోసం బోర్లు వేశారు. అవి కూడా ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడుతుంటే అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

అధికారులు చర్యలు చేపట్టాలి



అక్రమణలు జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు? బడాబాబుల తరపున అధికారులు పని చేస్తున్నారు. పంట బోదెలు, మురుగు బోదెలు అక్రమించుకుని చెరువులు తవ్వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే చర్యలు తీసుకోవాలి.

– దానం విద్యాసాగర్, పాములపర్రు

నిబంధనల అమలులో విఫలం



ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థ కట్టుదిట్టంగా ఉన్న ప్రాంతాల్లో ఆక్వా చెరువుల ఆక్రమణల వల్ల అస్తవ్యస్తంగా మారింది. అక్రమణల వల్ల చిరుజల్లులకే వరి ముంపునకు గురవుతుంది. ఇప్పటికైనా ఆక్రమణల చెర నుంచి పంట, మురుగు బోదెలను కాపాడాలి.

– నిమ్మల కేశవకుమార్, ఉప్పులూరు

ట్రిపుల్ ఐటీలో మెకానికల్ వర్క్‌షాప్



ట్రిపుల్ ఐటీలో మెకానికల్ బ్రాంచి విద్యార్థులకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆటోడెస్క్ ఇన్వెంటరీ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దీనిలో భాగంగా మెకానికల్ విభాగం హెచ్‌ఓడీ ఉడతా పావని, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ షేక్ అహ్మద్‌బాషా, ఉగ్యాన్ ఎడ్యుకేట్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ లీలాకృష్ణ, ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థి జైరామ్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ఆటోడెస్క్ విషయమై పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు 2డీ స్కెచింగ్, 3డీ మోడలింగ్ అండ్ అసెంబ్లీ, మిషన్ డ్రాయింగ్, జీడీ అండ్ టీ టూల్స్‌పై విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేసి చూపించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓడీ పావనీ మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ వల్ల విద్యార్థుల్లో పరిశ్రమలకు అవసరమైన ప్రాక్టికల్ నాలెడ్జి మరింత పెంపొందింపబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగం ఫ్యాకల్టీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



క్రీడాపోటీల్లో బహుమతులు పొందిన వైద్యవిద్యార్థులతో కళాశాల యాజమాన్యం

పెంటపాడు: విద్యార్థుల మైత్రికి క్రీడలు ప్రత్యేక బాటలని ఎన్‌టీఆర్ ఏపీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ పి.శంకరరెడ్డి పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో జరిగిన సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు. రిజిస్ట్రార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యత సాధించి, అడ్డంకులను అధిగమించడం, పోటీ తత్వం అలవర్చుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విజేతలను క్రీడల కన్వీనర్లు డాక్టర్ సురేంద్ర, సాయిరాం, సూపర్‌వైజర్ రమణ , డాక్టర్ పి.శోభారాణి, పలు వైద్యకళాశాలలకు చెందిన డాక్టర్లు, ఆరోగ్య విశ్వవిద్యాలయ స్పోర్ట్‌బోర్డు కార్యదర్శి ఈ.త్రిమూర్తి అభినందించారు. కళాశాలల డైరెక్టర్ ఆకుల విజయ వర్ధన్ మూడు రోజులపాటు క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు సమకూర్చారు.

అనుమానాస్పద స్థితిలో ఫార్మసిస్ట్ మృతి



రాజర్షి ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

భీమవరం (ప్రకాశం చౌక్): ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలివి. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం కరిచర్లగూడెంకు చెందిన ఖండవల్లి శ్రీనివాస్ (28) భీమవరం ఉండి రోడ్డులోని రాజర్షి ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగానే బుధవారం రాత్రి శ్రీనివాస్ ఆసుపత్రికి వచ్చాడు. అర్ధరాత్రి సమయంలో ఆస్పత్రిలో ఉన్న మెడికల్ షాప్ పక్కనే నేలపై పడుకున్న శ్రీనివాస్ తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో స్పర్శ లేకుండా ఉన్నాడని డ్యూటీ నర్స్ గమనించి పై ఫ్లోర్ లో ఉన్న డాక్టర్ రాజర్షికి సమాచారం అందించారు. ఆయన వచ్చి చూసి శ్రీనివాస్ మరణించినట్లు ధ్రువీకరించారు. మృతుని జేబులో ఇంజక్షన్ నీడిల్, మేజోలం ఇంజక్షన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో శ్రీనివాస్ బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. శ్రీనివాస్‌కు ఎటువంటి చెడు అలవాట్లు లేవని, మత్తుమందు తీసుకోవడం వల్లనే శ్రీనివాస్ చనిపోయినట్లు రాజర్షి చెబుతున్నారని, ఇది వాస్తవం కాదని అన్నారు. తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరారు.

పట్టిసంలో ముగిసిన ఉత్సవాలు



పట్టిసం రేవులో ఇంజిన్ పడవలు ఎక్కుతున్న భక్తులు



తాడువాయి వీరేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. ఉమ్మడి ఉభయగోదావరి, ఇతర ప్రాంతాల నుంచి సుమారు 1.50 లక్షల మందికి పైగా భక్తులు క్షేత్రానికి చేరుకున్నారని అంచనా. గోదావరి నది వెంబడి పటిష్ట బందోబస్తు, పక్కా ఏర్పాట్లతో భక్తులు ఎక్కడా కూడా వేరే ప్రాంతంలో నదిలో స్నానానికి వెళ్లలేదు. కాలినడకన వెళ్లి వచ్చే భక్తులకు కూడా సౌకర్యాలు కల్పించడంతో వీరైనంత త్వరగా దర్శనం చేసుకుని వెనుదిరిగారు. ఉత్సవాలు ముగియడంతో అధికార యంత్రాంగం చేసిన ఏర్పాట్లను ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారు. ఇసుక తిన్నెలపై భక్తులు పారవేసిన చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించే పనులు చేపట్టారు. భక్తుల రాక తగ్గడంతో ప్రత్యేక ఆర్టీసీ బస్సులను తొలగించారు.

3వ రోజు కూడా వీరేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు

పట్టిసంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని గురువారం కూడా భక్తులు దర్శించుకున్నారు. కాలినడకన వచ్చే భక్తులు క్షేత్రానికి నడిచి వెళ్లారు. నడవలేనివారు, వృద్ధులు రేవులో ఫెర్రీ లాంచీ కోసం ఎదురుచూసి లాంచీ తిరగకపోవడంతో నిరుత్సాహం వ్యక్తం చేశారు. అయితే కొందరు భక్తులు ఇంజిన్ పడవలకు రూ.100 చెల్లించి శివక్షేత్రానికి చేరుకుని దైవదర్శనం చేసుకున్నారు. ఎండవేడి తట్టుకోలేక, నడిచి వెళ్లలేని భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. శివరాత్రి జాగరణ చేసిన భక్తులు తెల్లవారుజామున స్వామి వారిని దర్శించుకున్నారు.

హుండీ లెక్కింపు

మహా శివరాత్రి ఉత్సవాలకు వీరేశ్వరస్వామి హుండీల్లో వేసిన సొమ్మును దేవస్థానం అధికారులు గురువారం ఉదయం లెక్కింపు చేపట్టారు. రూ.300 టిక్కెట్ విక్రయం ద్వారా రూ.10,75,800, రూ.50 టిక్కెట్ ద్వారా రూ.5,30,000, రూ.20 టిక్కెట్ల ద్వారా రూ. 3,39,740, కేశ ఖండన ద్వారా రూ.720 వచ్చింది. అలాగే హుండీల ద్వారా రూ.14,40,780, లడ్డూ విక్రయం ద్వారా రూ.2,16,000, పులిహోర విక్రయం ద్వారా రూ.61,760, కొబ్బరి చెక్కల విక్రయం ద్వారా రూ.1,33,000, కేశాల విక్రయం ద్వారా రూ.7,100, అన్నదాన విరాళాల రూపంలో రూ.4,26,978, మొత్తం రూ.42,31,878 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సీహెచ్ సురేష్‌నాయుడు తెలిపారు.

తాడువాయిలో విశేష పూజలు

జంగారెడ్డిగూడెం: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా తాడువాయిలో గురువారం రెండోరోజు భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి విశేష పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. వేకువజామునే స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమ పూజలు, నిత్యహోమాలు జరిపారు. అనంతరం గ్రామ బలిహరణ కార్యక్రమం జరిగింది. సాయంత్రం విచిత్ర వేషాలు, సన్నాయిమేళాలు, వాయిద్యాలు, బాణసంచా నడుమ పూలరథంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. కోలాట ప్రదర్శన, కాళీ కాంతారా నృత్యప్రదర్శన, సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుల వివక్ష కారణంగానే హెచ్‌ఎం సస్పెన్షన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం ఎంపీపీ స్కూల్‌లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం బీ సుబ్రహ్మణ్యం సస్పెన్షన్ కేవలం కుల వివక్ష కారణంగానే జరిగిందని బహుజన టీచర్స్ అసోసియేషన్ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడిమెల్లి వెంకటేశ్వరరావు, చేదే ధర్మలింగ ఒక ప్రకటనలో ఆరోపించారు. హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం కింద పనిచేయడం ఇష్టం లేని ఓసీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన టీచర్లు ఆ పాఠశాల విద్యార్థులను, తల్లిదండ్రులను ఆయుధంగా చేసుకుని ఇందులో ఆర్ఎస్ఎస్, హిందూమత సంఘాలను కూడా లాగి వారిని రెచ్చగొట్టి ఆ హెడ్మాష్టర్‌పై వ్యతిరేంగా వీడియోలు తీసి వైరల్ చేశారన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



పిల్లి లక్ష్మీ మృతదేహం

పెనుగొండ: గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన పెనుగొండ మండలం దేవ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం దొంగరావిపాలెంకు చెందిన పిల్లి లక్ష్మి (55) గురువారం ఉపాధి పనుల నిమిత్తం దేవ గ్రామం వెళ్లింది. అక్కడ పనులు చేస్తుండగానే ఒక్కసారిగా ఆమె కుప్పకూలిపోయింది. దీంతో ఆమెను పెనుగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె భర్త ఇటీవలే మరణించారు. ఆమెకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లాడు.

227 మద్యం సీసాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ ఎస్సై లక్ష్మణ్‌బాబు

నూజివీడు: మీర్జాపురంలో నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎన్ లక్ష్మణ్‌బాబు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి అక్రమంగా ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద 227 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై రూరల్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోళ్లు, వ్యర్థాలను తరలిస్తున్న వాహనం పట్టివేత

భీమడోలు: పౌల్ట్రీల్లో చనిపోయిన కోళ్లు, కోళ్ల వ్యర్థాలను అక్రమంగా చేపల చెరువులకు తరలిస్తుండగా అంబర్‌పేట ఏరియాలో గురువారం పోలీసులు పట్టుకున్నారు. కామవరపుకోట నుంచి పూళ్ల వైపుగా రెండు టన్నుల కోళ్లు, కోళ్ల వ్యర్థాలను వాహనంలో తోకలపల్లికి చెందిన భలే సత్యనారాయణ చెందిన చేపల చెర్వులకు తరలిస్తుండగా అంబర్‌పేటలో పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది కోళ్ల వ్యర్థాలు, మృతి చెందిన కోళ్లను గ్రామ శివారుల్లోని స్థలాల్లోని గోతుల్లో పూడ్చారు. ఆక్వా రైతుతో పాటు వ్యాన్ యాజమాని, డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

2న ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సంఘ ఎన్నికలు

ఏలూరు (మెట్రో): మార్చి, 2వ తేదీన ఏలూరు జిల్లా ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు జిల్లా ట్రెజరీ, ఏలూరు ప్రాంగణములో జరుగుతాయని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.కృష్ణంరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, సహాయ ఎన్నికల అధికారిగా షేక్ ఫయాజ్ అహ్మద్, ఎన్నికల పరిశీలకురాలిగా జె.కరుణ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సంబంధించిన ఉద్యోగులు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.



క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీటీసీ): స్థానిక ఏలూరు రోడ్‌లోని కాలువ గట్టు వద్ద వీరబ్రహ్మం ఆలయంలో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. విశేష పూజలు జరిపారు. పెదప్రోలు వీర్రాజు, పారేపల్లి ప్రసాద్, కె.విజయ్‌కుమార్, దాసరోజు నాగు, అనుపోజు మహేష్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవమూర్తులను రథంపై ఊరేగించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

దుప్పట్ల పంపిణీ



కంచుమర్రులో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అత్తిలి: కంచుమర్రు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత జనతా ట్రస్ట్‌ను ఆసంస్థ చైర్మన్ పి ఏసురత్నం గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా ట్రస్ట్ ఏర్పడిందని, పేద విద్యార్థులకు హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషలలో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడం, అనాథ పార్థివ దేహాలకు దహన సంస్కార కార్యక్రమాలు, వెనుకబడిన పిల్లలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి సహాయం చేయడం తమ ట్రస్టు లక్ష్యమన్నారు. కంచుమర్రు, ఈడూరు, ఉనికిలి, స్కిన్నెరపురం గ్రామాల్లో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి బాబూరావు, వైస్ చైర్మన్ జయప్రకాష్, మండల అధ్యక్షుడు జి దానియేల్, సెక్రటరీ తేలి చిట్టిబాబు, మండల కమిటీ సభ్యులు శాంతి స్వరూప్, బెన్ని ప్రసాద్, వెంకటరమణ, ప్రభాకర్, దావీదురాజు, సుబ్రహ్మణ్యం, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో ఎల్. అగ్రహారం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ హెచ్ఎం అనురాధ, తదితరులు

పెంటపాడు: మండలంలోని ఎస్‌వీఏఎస్ స్కూల్లో ఈనెల 22 నుంచి 25 వరకు జరిగిన గూడెం జోనల్ క్రీడా పోటీల్లో గూడెం మండలం ఎల్. అగ్రహారానికి చెందిన జెడ్పీస్కూల్ విద్యార్థులు అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా గురువారం స్కూల్లో విద్యార్థులను అభినందించినట్లు స్కూల్ పీడీ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. వై. దుర్గా గౌతమ్ షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం, పి. వీరమహాలక్ష్మి 200 మీటర్ల పరుగులో ద్వితీయస్థానం, జి. లీలాభవాని, పి.మహాలక్ష్మి, టి. నవ్యశ్రీలు లాంగ్‌జంప్, పరుగుపందెంలో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. వీరిని హెచ్ఎం అంబటి అనూరాధ, విద్యాకమిటీ చైర్మన్ నాగబత్తుల పెద్దింట్లు, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.

వాక్యజ్యోతి పోస్టర్ల ఆవిష్కరణ



పడాలలో వాక్యజ్యోతి సమావేశాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెంటపాడు: మార్చి 5,6 తేదీల్లో జట్లపాలెం గ్రామంలో వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశాలకు సంబంధించి పడాల చర్చిలో గురువారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చర్చిసంఘ సభ్యులు, సేవకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సమావేశాలను పరిసర గ్రామాల భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పాస్టర్లసంఘ నాయకులు కొమ్మిశెట్టి జాజిరాజు, ఘనరాజు, సువార్తగాయకులు జాషువా గరికి పాల్గొంటారని ఆమె తెలిపారు.

లయన్స్ సేవలు అభినందనీయం

ఉండి: లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. గురువారం ఉండిలో పర్యటించిన వేణుబాబు పేదలకు దుప్పట్ల పంపిణీ, సన్‌రైజ్ వృద్ధాశ్రమానికి రూ.10 వేలు ఆర్థిక సాయం, ఉండి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్వీ సూర్యనారాయణ రాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఇలా.. నడిచేదెలా!

- సెకండ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శిథిలమవుతున్న ఫుట్‌పాత్‌లు
- పట్టించుకోని అధికారులు



శిథిలమవుతున్న ఫుట్‌పాత్ వాల్







యాగర్లపల్లి-కడకట్ల బ్రిడ్జికి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై ధ్వంసమైన రాళ్లు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎప్పుడు పనులు అప్పుడే చేస్తే అంతా సవ్యంగా సాగుతుందని మన పెద్దలు చెబుతారు. అయితే ప్రభుత్వ శాఖల అధికారులు తక్షణమే పనులు చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడటంతో పాటు ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది. అందుకు ఉదహరణ యాగర్లపల్లి- కడకట్ల వంతెనపై ఫుట్‌పాత్ శిథిలమవ్వడం. వివరాలల్లోకి వెళ్లితే.. పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్‌లతో పాటు స్థానిక ఏలూరు కాలువ, రైల్వే ట్రాక్‌లు మీదుగా యాగర్లపల్లి నుంచి కడకట్ల వైపునకు నిర్మించిన సెకండ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీద ఇరువైపుల ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు శిథిలమయ్యాయి. ఇరువైపుల ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన కాంక్రీట్ రాళ్లు శిథిలం కావడంతో పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రాళ్లు పడి పోవడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల సిమ్మెంట్ రాళ్లకు ఉన్న ఊసలు కానవస్తున్నాయి. ఆ ఊసలు సైతం సూదిగా తయారై పాదచారులకు అవి తగిలి గాయాల పాలవుతున్నారు. వీటి కారణంగా నడిచే వారు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. చాలా ప్రాంతాల్లో సుమారు 10 అడుగులు నుంచి 20 అడుగులు వరకు ఫుట్‌పాత్ రాళ్లు లేకపోవడంతో ఫుట్‌పాత్‌లపై నడిచేందుకు వీలు ఉండటం లేదు. పాదచారులు ఫుట్‌పాత్‌పై నడిచే పరిస్థితులు ఉండటం లేదు. దీంతో ఫుట్‌పాత్ నుంచి దిగి రహదారి మార్గంలోనే నడుస్తున్నారు. రోడ్డు మీద నడిచే సమయంలో ఎప్పుడు ఏ వాహనం నుంచి ఏ ప్రమాదం సంభవిస్తోందని పాదచారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ ఫుట్‌పాత్‌లపై నడిచి, చీకటి కారణంగా ప్రమాదాలకు గురైన వారు సైతం ఉన్నారని, రాళ్లు లేని కారణంగా ఏర్పడిన గోతులలో పడి గాయాలు పాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా పరిస్థితి మార్పు లేదని చెబుతున్నారు. ఎప్పుడు నిత్యం రద్దీగా ఉండే ఈ బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌ను సరిచేయాలని,పాదచారులు ఇబ్బందుల ను గుర్తించాలని స్థానికులు కోరుతున్నారు. అంతేగాకుండా ఫుట్‌పాత్ పైన నిర్మించిన వాల్‌కు సైతం బీటలు వారుతున్నాయి. ఆయా సమస్య లను పరిష్కరించాలని, సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌కు ఇరువైపులా మరమ్మతులు చేపట్టాలి



రెండో ఫ్లై ఓవర్ బ్రిడ్జికు ఇరువైపుల ఫుట్‌పాత్‌లు శిథిలమయ్యాయి. గొయ్యిలు ఏర్పాడ్డాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం . సంబంధిత అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేపట్టాలి.

–తాడేపల్లి శ్యాంబాబు, ప్రాథమిక పాఠశాల పేరంట్స్ కమిటీ చైర్మన్

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన 'కొట్టు'



కుంచనపల్లి గ్రామంలో తాడేపల్లి దేవదాసు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు తాడేపల్లి మోషే సోదరుడు తాడేపల్లి దేవదాసు (60) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా దేవదాసు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. దేవదాసు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే, అదే గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్‌ముప్పిడి సంపత్‌కుమార్, కొలుకులూరి ధర్మరాజు, నాయకులు కనుపూరి ఉదయభాస్కర్, శ్రీనివాస్ ఉన్నారు.

నేటితో ఈ కేవైసీ ముగింపు

అత్తిలి: దాళ్వా ఈపంట నమోదుకు సంబంధించి ఈ కేవైసీ ప్రక్రియ నేటితో ముగుస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ గురువారం తెలిపారు. ఈ కేవైసీ చేయించుకోని రైతులు సమీప రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ వద్ద ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పంటనష్ట పరిహారం, సున్నావడ్డీ, పంటల బీమా వర్తిస్తుందని చెప్పారు.

ప్రశాంతంగా పోలింగ్



తణుకు అర్బన్: పోలింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కౌసర్ బానో



పెంటపాడు: మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్‌ను ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న పోలీసులు



తాడేపల్లిగూడెం: ఉదయం సుబ్బారావుపేట బూత్ వద్ద సందడి లేని చిత్రం



అత్తిలి: డిగ్రీ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

తణుకు అర్బన్: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తణుకులో గురువారం ప్రశాంతంగా జరిగాయి. 12 కేంద్రాల్లో నిర్వహించిన పోలింగ్‌లో పట్టభద్రులు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తణుకు పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జాస్తి సీతామహాలక్ష్మి బాలికోన్నత పాఠశాల, ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ, ఎస్సీఐఎం జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు వచ్చి ఓటర్లు ఓట్లు వేశారు. తణుకు పట్టణానికి సంబంధించి 72.3 శాతం పోలింగ్ జరిగినట్లు తహసిల్దార్ దండు అశోక్‌వర్మ తెలిపారు. మొత్తం 8,542 ఓటర్లకుగాను 6,176 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వివరించారు. ఇరగవరం మండలానికి సంబంధించి 3 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించగా మొత్తం 1978 మంది ఓటర్లు ఉండగా 74.75 శాతంతో 1480 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తణుకు, ఇరగవరం పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో కౌసెర్ బానో పోలింగ్ జరుగుతున్న తీరుతోపాటు రికార్డులు కూడా పరిశీలించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థికి ధీటుగా ప్రత్యర్థి అభ్యర్థుల నుంచి పోటీ పెరిగిన నేపథ్యంలో అధిష్ఠానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు తణుకు పట్టణంలోని 12 కేంద్రాల వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా చేరారు. కూటమి అభ్యర్థికే తమ ఓటును వేయాలని ఓటర్లను బతిమలాడుకున్నారు.

అత్తిలిలో 77.34శాతం పోలింగ్ నమోదు

అత్తిలి: మండలంలో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. గురువారం ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 4గంటల వరకు సాగింది. అత్తిలి ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ స్టేషన్‌ల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్తిలి మండలంలో మొత్తం 2,273 మంది ఓటర్లు ఉండగా, 1758 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 77.34 శాతం పోలింగ్ నమోదు అయింది. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద తణుకు సీఐ కె కృష్ణమోహన్, ఎస్ఐ పి ప్రేమరాజులు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసారు. పోలింగ్ కేంద్రాలను తాడేపల్లిగూడెం ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆర్ గోపిమూర్తి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పోలింగ్ సరళని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీవో పి శామ్యూల్ పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

తాడేపల్లిగూడెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకుగాను నియోజకవర్గానికి సంబంధించి గురువారం ఉదయం నుంచి ఓటింగ్ మందకొడిగా సాగింది. గూడెం పట్టణంలో 66.46 శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పెంటపాడు మండలంలో 72.6 శాతం మంది ఓటర్లు ఓటు వేశారు. ఈ మండలంలో ఉదయం పూట మందకొడిగా, మధ్యాహ్నం కాస్త పుంజుకొని, సాయంత్రం వేగంగా పోలింగ్ జరిగింది. గూడెం పట్టణంలో ఉన్న సుబ్బారావుపేట హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్, ఈవీఎం స్కూల్‌లలో ఉన్న పది పోలింగ్ బూత్‌లలో 66.46 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్లకు తాయిలాలు కూటమి అభ్యర్థి అందిస్తారని చాలా మంది ఆశించారు. ఏ బూత్ దగ్గర చూసినా కూటమి నాయకుల హడావిడి కనిపించింది.

పెంటపాడులో 72 శాతం పోలింగ్

పెంటపాడు: మండలంలోని ప్రభుత్వ బేసిక్‌స్కూలు, గోయంకా డిగ్రీ కళాశాలలోని మూడు పోలింగ్ కేంద్రాల్లో 72 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రాలలో ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. మూడు కేంద్రాలలో మొత్తం 1,863 ఓట్లకు గాను 1,355 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలలో ఒకే కుటుంబానికి చెందిన అక్కా తమ్ముళ్లైన కిలాడి సంధ్యారాణి, కిలాడి రాజు, కిలాడి భగత్‌లు మొదటిసారి వచ్చిన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రత్తిపాడుకు చెందిన గ్రామ మాజీ సర్పంచ్ మామూడూరి విజయ్‌కుమార్ పక్షవాతంతో బాధపడుతూ కూడా పెంటపాడు కళాశాలకు వచ్చి తన ఓటును సద్వినియోగం చేసుకున్నారు.

కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ

తాడేపల్లిగూడెం (టీటీసీ): కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి విలీన సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ గురువారం పట్టణంలో నిర్వహించారు. దానవరప్రసాద్ మాట్లాడుతూ 2013లో కొన్ని కారణాలు వల్ల ఐఎఫ్‌టీయూ రెండుగా చీలిపోయిందని తెలిపారు. రెండు జాతీయ కమిటీలు చర్చలు జరిపినట్లు చెప్పారు. ఒకే ఐఎఫ్‌టీయూగా రూపుదిద్దుకోవడానికి మార్చి 2వ తేదీన రాజమండ్రిలోని పుష్కరాలు రేవు వద్ద చందా సత్రంలో సభ జరుగుతుందని, సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని, సభను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో పాసిస్ట్ ప్రమాదం పెరుగుతుందని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య పెరగడం, ప్రభుత్వ రంగంలో కనీస వేతనాలు లేకపోవడం, స్కీమ్ వర్కర్స్ వెట్టి చాకిరీ చేయించడం శోచనీయమన్నారు. ఐక్య ఉద్యమాలు నిర్మించేందుకు ఐఎఫ్‌టీయూ ఒకే నిర్మాణం కింద, ఒకే కమిటిగా ఏర్పడి విలీనం అవుతుందని, విజయవంతం చేయాలని కోరారు. పి.రాము, చిన్నరెడ్డి, సుబ్బారావు, నాగేశ్వరరావు, రమణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



తేతలిలో శ్రీదేవిని సత్కరిస్తున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు

తణుకు అర్బన్: ఫొటోగ్రఫీలో వస్తున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని ఫొటోగ్రాఫర్లు ఆర్థికంగా ఉన్నతస్థాయికి ఎదగాలని తణుకు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షురాలు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి అన్నారు. తణుకు మండలం తేతలిగ్రామ పరిధిలోని డ్రీమ్ ల్యాండ్ స్టూడియోలో జిల్లా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫొటోగ్రఫీ వృత్తిలో జీవనం సాగిస్తూ ఎవరిపైనా ఆధారపడకుండా ఫొటోగ్రాఫర్స్ ఎంతో హుందాగా గౌరవంతో ఉపాధి పొందుతున్నారని ప్రశంసించారు. ఫొటోగ్రఫీలో మొదట నెగిటివ్ రీల్ ప్రింటింగ్ విధానం అందుబాటులో ఉండగా దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు అనుగుణంగా నేడు డిజిటల్ విధానం అందుబాటులోకి వచ్చిందని నిముషాల వ్యవధిలోనే ఫొటో ఇవ్వగలుగుతున్నామని స్పష్టం చేశారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీదేవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ రాష్ట్ర సంక్షేమ సంఘం చైర్మన్ మాదల రమేష్, కోశాధికారి చిలంకుర్తి శేషు, ఉమ్మడి జిల్లాల చైర్మన్ మారడాని రాము, జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపిశెట్టి శ్యామ్‌బాబు, బత్తిన గిరిబాబు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ షబ్బీర్, కార్యదర్శి గోపిశెట్టి మురళికృష్ణ, ఉపాధ్యక్షుడు కేఎస్ఎన్ మూర్తి, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ వార్షికోత్సవం



ప్రత్తిపాడులో అన్నసమారాధన దృశ్యం

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు, అలంపురం, కోరిమిల్లి గ్రామాల్లో గురువారం భారీ అన్న సమారాధనలు జరిగాయి. ప్రత్తిపాడు గ్రామ దేవత కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను ఆధ్వర్యంలో ఘనంగా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలంపురంలో సాయిబాబా ఆలయంలో కొలనువాడ పెదకృష్ణంరాజు ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పెరుగుతున్న సూర్యతాపం

- 34 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- దాహార్తితో ప్రజలు
- జ్యూస్ సెంటర్లకు క్యూకడుతున్న వైనం





తాడేపల్లిగూడెం పట్టణంలో వేసవి తీవ్రతకు కొబ్బరి బొండాలు, జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్న ప్రజల దృశ్యాలు

తాడేపల్లిగూడెం రూరల్: శీతాకాలం వెళ్లకుండానే సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మహాశివరాత్రికి చలి శివ శివా అంటూ వెళ్లిపోతుందని పెద్దలు చెబుతారు. శివరాత్రికి పది రోజులు ముందు నుంచే వాతావరణ ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. వేసవి ప్రవేశించకుండానే ఈ మేరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడంపై ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సాధారణాన్ని మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం ఒక్క రోజులోనే 34 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తాడేపల్లిగూడెంలో నమోదు చేసుకున్నాయి. దీన్ని బట్టి ఉష్ణోగ్రతలు ఏ మేర పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది శీతాకాలం సీజన్‌లో చలి సైతం తక్కువేనని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది ఎండ తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సూర్యుని ఎండ తీవ్రతకు నాలుకలు తడారుకుపోతున్నాయని పలువురు ప్రజలు వాపోతున్నారు. దీంతో కూలింగ్ వాటర్, జ్యూస్ సెంటర్ల వైపు క్యూకడుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు మేము సైతం సిద్ధం అన్నట్టుగా నిన్న మొన్నటి వరకు కానరాని ఫ్రూట్ జ్యూస్ సెంటర్లు తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో కోకొల్లలుగా వెలిశాయి. ఏ రహదారి చూసినా అడుగుకో జ్యూస్ సెంటర్ దర్శనమిస్తోంది. కొనుగోలుదారులతో ఆయా జ్యూస్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. మరో పక్క కొబ్బరి బొండాలు, పుచ్చకాయల విక్రయాల స్టాల్స్ పెరిగాయి. పుచ్చకాయలైతే ఆకుపచ్చ, పసుపు వంటి రంగుల్లో సైతం లభిస్తున్నాయి. వేసవి తాపం నుంచి శరీరానికి కూల్ చేసే తాటిముంజులు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఎండ తీవ్రతకు ప్రజలు ఇప్పటి నుంచే గగ్గోలు పెడుతున్నారు.

ఉమా రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో ఉమా రామలింగేశ్వరస్వామి

అత్తిలి: మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా అత్తిలి మండలంలోని పాలూరు గ్రామంలో ఉమా రామలింగేశ్వర స్వామికి గురువారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయం చుట్టూ వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలూరు క్షత్రియులు, గ్రామ శివభక్తుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రాళ్లచెరువుకు మోక్షం కల్పించాలి

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్‌లోని ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలో ఉన్న రజకుల రాళ్లచెరువుకు మోక్షం కల్పించాలని ఆ రజక సంఘం మండల అధ్యక్షులు భీమవరపు మహంకాళి మొరపెట్టుకున్నారు. గురువారం రాళ్లచెరువుకు ఉన్న ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరువులోకి నీరు వచ్చే అవకాశం లేదని చెరువులోని మురుగునీరు బయటకు వెళ్లే మార్గం పూడుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మార్గాలూ ఆక్రమణలకు గురై నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్నాయని పేర్కొన్నారు.